క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



మృతుని కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: కుటుంబం పెద్ద దిక్కును కోల్పోతే ఆ కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తున్నారని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. వార్డు పరిధిలోని దయాల్‌నగర్ లోవకు చెందిన యడ్ల సన్యాసిరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, అతని కుటుంబాన్ని శుక్రవారం వంశీరెడ్డి పరామర్శించారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10వేలను మృతుని భార్య యర్రయ్యమ్మకు అందజేశారు. మిగిలిన డబ్బులు తొందరలోనే వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సీవో సూర్యనారాయణ, రమేష్, అనూష, ఎస్.వై.నాయుడు, బొడ్డు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఉమా రామలింగేశ్వరాలయంలో అన్నసమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఉమా రామలింగేశ్వర ఆలయంలో మాస శివరాత్రి పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఉమా రామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఉక్కు అధికారి ఎం. కాశిప్రసాద్ సహకారంతో నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని, అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాస్, సురేంద్ర, లలితారావు, మంత్రి గోపి, కనకరెడ్డి, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు .

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు ప్రసన్న కుమార్

గాజువాక : మై మదర్స్ విజనరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 22న నిర్వహించనున్న ఉచిత నేత్ర వైద్య శిబిరం పోస్టర్‌ను సినీ నటుడు ప్రసన్న కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గాజువాక హైస్కూల్ రోడ్‌లోని నవత ట్రాన్స్‌పోర్టు ఎదురుగా ఆదివారం నిర్వహించనున్న శిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ రీజనల్ కంటి ఆస్పత్రి సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించనున్నామని, పలువురు ప్రముఖ వైద్యులు శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు ఎస్.శ్రీనివాసరావు, పినిశెట్టి రమేష్, తంగప్పన్ కుమార్, రవి బోసెల, లంకా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. అప్పన్న నిత్యకల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శుక్రవారం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి కల్యాణం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఉభయదాతలకు అక్షింతలు, శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ప్రజా గర్జనతో కేంద్రానికి గుణపాఠం

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- నిర్వాసిత కాలనీల్లో మహా పాదయాత్ర



పాదయాత్రలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో స్టీల్‌ప్లాంట్‌ను సాధించుకున్నామని, దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానివ్వబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఈ నెల 30న నిర్వహించనున్న ప్రజా గర్జనతో కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామన్నారు. ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వాసిత కాలనీల్లో శుక్రవారం మహా పాదయాత్ర చేపట్టారు. నడుపూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన యాత్ర ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఉక్కునగరంలోని తృష్ణ మైదానంలో నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, నిర్వాసితులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ 708 రోజులుగా ఉద్యమాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో నిర్మించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ఎలా ప్రైవేటుపరం చేస్తారని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. నాయకులు, కార్మికులు, నిర్వాసితులు పెదగంట్యాడ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, అనిపెద్ది మసేనురావు, నమ్మి రమణ, బొడ్డు పైడిరాజు, డి.వి. రమణ, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి సత్యారావు, గొందేశి వెంకటరమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, మార్టుపూడి పరదేశి, జగదీష్, నక్క రమణ, దొమ్మేటి అప్పారావు, నీరుకొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలి



స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ సభలో ప్రసంగిస్తున్న అఖిలపక్ష నాయకులు

ఉక్కునగరం: ప్రజా గర్జనతో కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు అన్నారు. ఈ నెల 30న ఉక్కు తృష్ణ మైదానంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్న ప్రజా గర్జన ప్రచారంలో భాగంగా శుక్రవారం స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగం క్యాంటీన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో నాయకులు మాట్లాడారు. లక్ష మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్న ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ప్లాంట్ ప్రారంభం నుంచి వేల కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు, డివిడెండ్ల రూపేణా చెల్లించిందని చెప్పారు. ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే, నిర్వాసితులు పూర్తిగా నష్టపోతారన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పెద్ద ఎత్తున నిరసన తెలిపేందుకు అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులను ఆహ్వానించామని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా ప్రజలు సభకు హాజరు కావాలన్నారు. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకులు కొమ్ము ప్రసాదరావు, తాండ్ర కనకరాజు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, డి. నర్సింగరావు, రామ్‌కుమార్, కరణం సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థపై విషం

- ఓడిపోతామనే భయంతోనే పిచ్చిరాతలు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: అవినీతి, అక్రమాలకు తావు లేకుండా, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకాన్ని వలంటీర్లు నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నారని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అటువంటి వ్యవస్థపై విషం చిమ్మడం విస్మయాన్ని కలిగిస్తోందన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులుగా పని చేస్తున్నారని తెలిపారు. కులమతాలకు అతీతంగా, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారని వివరించారు. నీతిగా నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న వలంటీర్ల పనితీరు చూసి ఓర్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం కాళ్లరిగేలా తిరగడంతో పాటు డబ్బుల కోసం మూడు నాలుగు రోజులు పడిగాపులు కాసే వారన్నారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత, వలంటీర్లను నియమించి ప్రతీ నెలా ఒకటో తేదీనే, నేరుగా లబ్ధిదారుల వద్దకే వెళ్లి పెన్షన్లు అందిస్తున్నారని వివరించారు. వలంటీర్ల వ్యవస్థ వచ్చిన తర్వాత ఏ ఒక్క లబ్ధిదారుడు గడప దాటకుండానే ప్రభుత్వ పథకాలను అందుకుంటున్నాడని, అటువంటి వ్యవస్థపై తప్పుడు రాతలు రాయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కరోనా కాలంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలందించారని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకుతిన్నారని దుయ్యబట్టారు. వార్తలు రాసే ముందు వాస్తవాలు గ్రహించాలని సూచించారు.

ప్రభుత్వరంగ సంస్థల వల్లే ఆర్థిక ప్రగతి



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న రామారావు

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థల వల్లే దేశంలోని ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 708వ రోజు, శుక్రవారం సీఎంఎం, సీఆర్ఎంపీ, సీఈడీ కార్మికులు పాల్గొన్నారు. దీక్ష శిబిరంలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు ఎస్. రామారావు మాట్లాడుతూ త్యాగాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే సహించేది లేదన్నారు. దళితులు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని ఆరోపించారు. ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను, రాయితీలను సమసమాజ స్థాపనకు ఉపయోగపడే విధంగా చేస్తామని ప్రమాణం చేసిన కేంద్ర ప్రభుత్వం నేడు కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికే వరకు వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తూనే ఉంటామన్నారు. శిబిరంలో వివిధ విభాగాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

పేదల ఇంట సంక్షేమ కాంతులు



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతీ ఇంటా సంక్షేమ కాంతులు వెలుగుతున్నాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలతో పేద కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన 72వ వార్డులో ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. తమకు పథకాలు సకాలంలో అందుతున్నాయంటూ వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సంతోషాలు ఇలాగే కొనసాగడం కోసం జగన్ మోహన్‌రెడ్డికి మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 72వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, నాయకులు రాజాన వెంకటరావు, ఉరుకూటి అప్పారావు, వాసవి నాయుడు, మధుసూదనరావు, రామిరెడ్డి, శ్రీను, మధు, జగన్, నిర్మల, భవాని, ధనలక్ష్మి, నాగమణి, హేమలత, పద్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవోతో పాటు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రుద్ర రాజశ్యామల హోమం

సింహాచలం: పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో రాంపురంలోని ఆయన స్వగృహంలో నిర్వహించిన రుద్ర రాజశ్యామల హోమం శుక్రవారంతో ముగిసింది. మూడోరోజు హోమం అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. 108 మంది ముత్తయిదువలకు అదీప్‌రాజ్ దంపతులు తాంబూలం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు బాగుండాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసే శక్తి ప్రసాదించాలని హోమం నిర్వహించినట్టు చెప్పారు.

రైళ్ల పరిశుభ్రతకు సహకరించండి

- ప్రయాణికులకు డీఆర్ఎం విజ్ఞప్తి



డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రైళ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయాణికులు సహకరించాలని, ఇది అందరి బాధ్యతని డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి అన్నారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం చేరుకున్న వందేభారత్ రైలును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు హౌస్‌కీపింగ్ సిబ్బంది రైలును శుభ్రం చేస్తున్నా కూడా విశాఖకు చేరేసరికి పలు కోచ్‌ల నిండా ప్లాస్టిక్ బాటిల్స్, పేపర్ కప్స్, వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారేసి ఉన్నాయని చెప్పారు. పరిస్థితిని చూసిన డీఆర్ఎం స్పందిస్తూ డోంట్ బీ బిట్టర్–స్టాప్ ద లిట్టర్ అని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ప్రతిష్టాత్మక వందేభారత్ రైలు శుభ్రంగా ఉంచాలని, దీనికోసం డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారని తెలిపారు.

ధ్యానంతో చక్కటి ఆరోగ్యం

మల్కాపురం : శ్రీహరిపురం వద్ద గల శ్రీకృష్ణుని ఆలయంలో ధ్యానంపై ఉచిత శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశీస్సులతో పిరమిడ్ సొసైటీ సహకారంతో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ భాగ్యగౌరి, పిరమిడ్ సొసైటీ సభ్యులు శివనాగేశ్వరరావు, రేవతీదేవి తదితరులు మాట్లాడుతూ ధ్యానం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందొచ్చన్నారు. ధ్యానంతో మనసుకు ప్రశాంతత, పరుల పట్ల ప్రేమ, గౌరవంగా నడుచుకునే విధానాలు అలవడతాయన్నారు. నిత్యం ప్రతి ఒక్కరు 30 నిమిషాల పాటు ధ్యానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజేష్, అప్పలరాజు, గోపాల్, సన్యాసిరావు, శ్రీనివాసరావు, బాపారావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిట్టినాయుడు తీర్థం



చిట్టినాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

గాజువాక : గాజువాక ప్రథమ సర్పంచ్ ఉరుకూటి సన్యాసినాయుడు (చిట్టినాయుడు) తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, చిట్టినాయుడు తనయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు తదితరులు చిట్టినాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక అభివృద్ధిలో చిట్టినాయుడు కృషి మరువలేనిదన్నారు. పంచాయతీ స్థాయి నుంచి మహానగర స్థాయికి ఎదిగిన గాజువాక అభివృద్ధికి చిట్టినాయుడు వేసిన పునాది ఎన్నటికీ చిరస్మరణీయమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లు కొనుగోలుదార్లతో కిక్కిరిశాయి. కార్యక్రమంలో నాయకులు ఉరుకూటి కృష్ణమూర్తి, పల్లా రమణ, గొలగాని గోపీచంద్, పుల్లయ్య, ఉరుకూటి సతీష్ తదిరులు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె



ఎల్ఐసీ సెంట్రల్ బ్యాంకు వద్ద నిరసన చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

దాబాగార్డెన్స్ : యునైటెడ్ ఫోరమ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం బ్యాంక్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఎల్ఐసీ బిల్డింగ్ సెంట్రల్ బ్యాంక్ వద్ద కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సమన్వయ సంఘం ప్రతినిధులు ఆర్‌వీ రవికుమార్, వి. కమలాకర్, వి. రమేష్ మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని, కొన్ని సవరణలతో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కొత్త పెన్షన్ విధానం రద్దు చేయాలన్నారు. 12వ ద్వైపాక్షిక వేతన సవరణ ఒప్పందం అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. 11వ వేతన సవరణలో అమలు కాకుండా ఉన్న న్యాయమైన డిమాండ్ల పట్ల సానుకూలంగా ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నెల 30, 31 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్టు తెలిపారు. పి. ఈశ్వరరావు, టి. రాజు, బి. రామారెడ్డి, జి. సూర్యలక్ష్మి, ఎస్. అనూషఖాను, కెఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయ భవనం

- ఇరుకు గదిలోనే నిర్వహణ
- పెచ్చులూడుతున్న శ్లాబ్
- కానరాని వసతులు
- తగ్గుతున్న పాఠకుల సంఖ్య



నాతయ్యపాలెం శాఖా గ్రంథాలయం



గంథాలయంలో శిథిలమైన కిటికీ



పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న శ్లాబ్



వర్షాలకు కారడంతో పుస్తకాలు తడవకుండా కప్పిన టార్పాలిన్

అక్కిరెడ్డిపాలెం: తిరగని ఫ్యాన్లు.. కనీ కనిపించని వెలుతురు.. చిన్న గదిలో చిత్తడిగా నేల.. ముక్కిన పుస్తకాల దుర్గంధం.. ఇదీ 69వ వార్డు పరిధి నాతయ్యపాలెం శాఖా గ్రంథాలయం దుస్థితి. గోడలకు పగుళ్లు.. కిటికీలకు చెదలు పట్టి, ముట్టుకుంటే పడిపోయేలా ఉండడంతో లైబ్రరీలో పుస్తకాలకు రక్షణ కరువైంది. కొత్త పుస్తకాలు వస్తున్నా, వాటిని తెచ్చి పెట్టేందుకు సరైన సదుపాయం లేక గాజువాక గ్రంథాలయంలోనే ఉంచేయాల్సిన పరిస్థితి. ఎంతోమందికి విజ్ఞానాన్ని అందించే పుస్తక భాండాగారంలో తగిన వసతులు లేక పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 12 వేల జనాభా గల నాతయ్యపాలెంలో ఎక్కువగా గ్రాడ్యుయేట్స్‌తో పాటు బీహెచ్‌పీవీ, స్టీల్‌ప్లాంట్ పరిశ్రమలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు నివసిస్తున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఈ లైబ్రరీ ఎంతో అవసరం. కానీ అక్కడి వాతావరణం అనువుగా లేక, దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. దీంతో నిత్యం నామమాత్రం స్టూడెంట్స్, సీనియర్ సిటిజన్స్ మాత్రమే వస్తుంటారు.

రెండు లైబ్రరీలకూ ఒక్కరే ..

నాతయ్యపాలెం శాఖా గ్రంథాలయానికి పూర్తిస్థాయిలో కొనసాగుతున్న లైబ్రేరియన్‌కు సింధియా లైబ్రరీ బాధ్యతలను కూడా అప్పగించారు. దీంతో అక్కడకూ వెళ్లాల్సి వస్తోంది. ఆ సమయంలో ఇక్కడి లైబ్రరీ బాధ్యతను అప్పగించేందుకు అసిస్టెంట్ కూడా లేక ఇబ్బంది ఎదురవుతోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని అన్ని వసతులతో గ్రంథాలయాన్ని తీర్చిదిద్దాలని, పూర్తిస్థాయి ఉద్యోగులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆధునీకీకరించాలి

కాంపిటీటివ్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు లైబ్రరీకి వెళ్తున్నాను. కానీ అక్కడ సరైన ఫర్నిచర్ లేదు. వెలుతురు సరిగ్గా ఉండదు. ముక్కిపోయిన వాసన, వర్షాకాలంలో లైబ్రరీ మొత్తం చిత్తడిగా మారుతుంది. ఎంతోమందికి ఉపయోగకరంగా ఉన్న లైబ్రరీను ఆధునీకరిస్తే మాలాంటి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం.

– ప్రశాంత్ కుమార్, స్టూడెంట్, నాతయ్యపాలెం

దారుణంగా ఉంది

నేను రిటైర్డ్ ఉద్యోగిని. లైబ్రరీలో పేపర్లు చదవడానికి రోజూ వస్తుంటాను కానీ ఈ గ్రంథాలయం పరిస్థితి దారుణంగా ఉంటోంది. వెలుతురు సరిగ్గా ఉండదు. పెచ్చులూడిన శ్లాబ్ ఎవరిపై పడుతుందో అనే భయం. లైబ్రరీని అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతవాసులకు ఎంతో మేలు. పిల్లలు, పెద్దలు అందరికీ ఉపయోగపడుతుంది.

– సూర్యనారాయణ, విశ్రాంత ఉద్యోగి, నాతయ్యపాలెం

ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖ

- నిషేధిత ప్లాస్టిక్ సంచులు విక్రయించినా, వినియోగించినా జరిమానా
- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



రైతు బజార్‌లో వినియోగదారులతో మాట్లాడుతున్న కమిషనర్, డిప్యూటీ మేయర్

గోపాలపట్నం: విశాఖను ప్లాస్టిక్‌రహిత నగరంగా మారుద్దామని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు అన్నారు. శుక్రవారం 52వ వార్డులో ఆయన డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో కలిసి పర్యటించారు. గౌరీనగర్‌లో టిడ్కో ఇళ్లు పూర్తయి నిరుపయోగంగా ఉన్నాయని.. వాటిని లబ్ధిదారులకు అందివ్వాలని స్థానికులు కోరగా స్పందించిన కమిషనర్ వారం పది రోజుల్లో రైల్వే సమస్యను పరిష్కరించి ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

రైతు బజార్ సందర్శన

మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో ఉన్న రైతు బజార్‌ను కమిషనర్ రాజాబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సందర్శించారు. అక్కడ ప్లాస్టిక్ సంచుల వాడకంపై ఆరా తీశారు. వినియోగదారులతో మాట్లాడారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులు అమ్మినా, వినియోగదారులు వాడినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చి దిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. నగరంలో నిషేధిత ప్లాస్టిక్ సంచులు కనిపించరాదని తెలిపారు. ప్రతిరోజు దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ప్లాస్టిక్ సంచులకు బదులు వస్త్ర సంచులు వాడాలని సూచించారు.